# దవడ మెంతికాయ

-ఎ.కె.వి. రత్నమాల

అదేం ఖర్మో... నేను ఎప్పుడు ఊర్నుంచి ఆవకాయ తెచ్చినాసరే గుట్టుచప్పుడు కాకుండా తెద్దామనుకుంటాను. కానీ నేను ఆవకాయ తెచ్చిన విషయం కేశనపల్లి నుంచీ హైదరాబాద్ వరకూ నేను చెప్పక్కర్లేకుండా అందరికీ తెలిసిపోతుంది.

పోదు మరీ! నేను ఆవకాయ తెచ్చానంటే ఆ సీను ఆషామాషీగా ఉంటుందా? మా ఆవకాయ తాలూకు ఊట ఇటు మాకూ, మా బట్టలకీ, మేం బస్సులో కూర్చున్న సీట్లకే కాకుండా మా పక్కవాళ్ళకీ, వెనుకవాళ్ళకీ, వెనకనుంచీ ముందుకొచ్చి దిగేవాళ్ళకీ, ముందునుంచీ ఎక్కి వెనక్కంటూ వెళ్ళేవాళ్ళకీ, వాళ్ళ లగేజీలకీ, అబ్బో బస్సు బస్సంతా అంటుకోందే అది మా ఇంటికి రానేరాదు.

మరి ఇంత హంగామా జరిగాక నేను ఆవకాయ తెచ్చిన విషయం అందరికీ తెలియకుండా ఎలా వుంటుంది? ఆపైన ఆటో మా ఇంటి ముందు ఆగడమే ఆలస్యం... చుట్టుప్రక్కల వాళ్లంతా కళ్లతోనే వెతికేసుకుంటారు. ఎర్రెర్రగా, జిడ్డోడుతూ యుద్ధరంగంలో గాయపడ్డ క్షతగాత్రుడిలా గుడ్డలో చుట్టి ఉండే శాల్తీకోసం! అది కనబడగానే వాళ్ళు నిర్ధారించేసుకుంటారన్నమాట. నేను ఊరి నుండి అవకాయ తెచ్చిన సంగతి.

ఇంత జరిగాకా ఇంక నేను దాచగలిగిందీ, అబద్ధం చెప్పగలిగిందీ ఏం వుంటుంది కనుక? ఇక అక్కడ్నుంచీ "మీ కొత్తావకాయ మాకు రుచి చూపించరా?" అంటూ నిర్మొహమాటంగా అడిగేసే చుట్టుపక్కలవాళ్ళందరికీ ఏడవలేక నవ్వుతూ తలో కాస్తా పంచిపెట్టుకొచ్చేసరికి తెచ్చినదాంట్లో ముప్పాతిక మూడొంతులు అయ్యేపోతుంది. ఆ మిగిలిన అడుగూబొడుగూ అవకాయతో ఎలాగో మూణ్ణెల్లు నెట్టుకొచ్చేసరికి డబ్బా ఖాళీ.


అందుకే ఊరెళ్ళి ఆవకాయ తెస్తున్నప్పుడల్లా మా అమ్మతో ముందుగానే చెబుతుంటాను... "అవకాయలో అలా పీకలలోతు నూనె పోయకు" అని. ఆ పైన ఎందుకలా అన్నానో సంగతీ, సందర్భమూ విశదంగా చెబుతాను కూడా. అయినా అమ్మ వినిపించుకుంటేగా? వినేవన్నీ వినేసి ఆపైన తేలిగ్గా నాలుక చప్పరించేస్తుంది.

"కుర్ర మొహాలు! ఎంత ఆవకాయకి ఎంత నూనె పోయాలో మీకేం తెలుస్తుంది? అయినా ఈ ఊట హైదరాబాద్ వెళ్ళేవరకూ ఉంటుందా? ఏమన్నాన్నా? ఆ బస్సు వేడికీ, ఎండలకీ ఇట్టే ఇగిరిపోదూ" అంటుంది. అక్కడికి అంబాజీపేట హద్దులు దాటి పుల్లేటికుర్రు పొలిమేరల్లోకి ప్రవేశించే సరికే నూనెంతా ఇగిరిపోయి ఆవకాయ కాస్తా ఒరుగయిపోతుందన్నట్టుగా!

అమ్మ చాదస్తానికి విసుగేసినా ఆ చాదస్తంలో ఇమిడి ఉండే అతి ప్రేమ నా నోరు నొక్కేస్తుంది. అంతే! కేశనపల్లి నుంచి ఊరగాయలు పట్టుకుని కడిగిన ముత్యాల్లా బయల్దేరేమేంకాస్తా హైదరాబాద్‌లో దిగేసరికి పాత బస్తీలో కత్తిపోట్లు తిన్నవాళ్లలా తయారవుతాం.


ఈసారీ అదే జరిగింది. మేం ఆవకాయ తెచ్చిన సంగతి మా చుట్టుప్రక్కల వాళ్లందరికీ తెలిసిపోయింది. ఆ విషయం వాళ్ళందరికీ తెలిసిపోయిందన్న సంగతి మా ఆయనకీ తెలిసిపోయింది. అందుకేనేమో ఇంట్లోకి అడుగు పెడుతూనే ఆయన నాకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు... "ఇదిగో! నువ్వసలే దానకర్ణుడి దత్తపుత్రివీ, దయామయుడి దౌహిత్రి వీనూ! మీ అమ్మగారు కష్టపడి పెట్టిచ్చిన ఆవకాయ కాస్తా అందరికీ పంచి పెట్టెయకు. అంతగా ఇవ్వాలనుకుంటే అదేదో ఉందిగా... మెంతికాయ! అది





## చిత్రమైన కళాకృతులు

ఇవి ఇటలీలోని చరిత్ర ప్రసిద్ధి పొందిన కొలోసియమ్‌లు అనుకుం





టున్నారా? మీరు భావించినట్టు అని కావు. నిజానికి వీటిని కోకోకోలా ఖాళీ టిన్నులతో 30 మంది మూడునెలలపాటు ఎంతో శక్తియుక్తులతో రూపొందించారు. వాటి పొడవు 10.5 మీటర్లు. విస్తీర్ణం 37.3 మీటర్లు. ఆ కళాకారులే ఇటలీలో ప్రసిద్ధిపొందిన 'సర్కస్ ఆఫ్ వెరోనా', 'సెయింట్ పీటర్స్ బేసిలికా'లను నయనానందకరంగా టిన్నులతో రూపొందించారు. వ్యర్థ పదార్థాలను ఉపయోగంలోకి తేవడానికి, వాతావరణ కాలుష్యాన్ని తొలగించడానికి కృషి చేస్తున్న ఇరువురు యువకులు ఇజినో, జియోతన్నీల శ్రమ ఫలితం ఇది

-కొడిమెల

చ్చేయ్'' అంటూ.

నిజం చెప్పొద్దూ... బుల్లిబుల్లి బుడతల మామిడి కాయల్ని దవడలు మాత్రంకోసి వాటిలో మెంతి పిండి కూరి కాయలఫళంగా పెట్టిన ఆ మెంతి కాయ్ ఎంత ఘుమఘుమలాడిపోతోందో! వేడి వేడి అన్నంలో ఇంత మెంతికాయ వేసుకుని ఉల్లిపాయలు కొరుక్కు తింటూంటే స్వర్గం కనిపిస్తుంది. రుచి విషయంలో ఆవకాయకేం తీసిపోదది. అలాంటి మెంతికాయని పంచి పెట్టెయ్యమనేసరికి నా ప్రాణం విలవిల్లాడింది.

ఆయనకేమో ఆవకాయన్నా, పులిహోర ఆవకాయన్నా ప్రాణం. మావాడేమో అమ్మచేత అడిగి మరీ పెట్టించుకున్న బెల్లపు ఆవకాయ తప్ప రెండోది ముట్టుకోడు. నాకు మెంతికాయంటే ఇష్టం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మిగిలినవన్నీ మాకు దక్కాలంటే మెంతికాయని త్యాగం చేయక తప్పదనిపించింది.

ఆ సాయంత్రమే ఇరుగుపొరుగువాళ్ళ దండయాత్ర ప్రారంభమయింది. ప్రయాణం బడలికతో గాఢనిద్రలోవున్న నన్ను అర్జంటుగా లేపేసింది మా పక్కింటి దుర్గమ్మగారు.

''ఊర్నించి ఆవకాయ తెచ్చినట్టున్నారే?'' అనడి గేసింది వెంటనే.

ఆవిడ ఆత్రాన్ని చూస్తే నాకు అటు నవ్వుతోపాటు ఇటు కోపమూ రెండూ ఏకకాలంలో కలిగాయి.


''మేం తెచ్చింది ఆవకాయ కాదులెండి. దవడ మెంతికాయ్'' అబద్ధం చెప్పేసాను నాలో కలిగిన భావాలను అతికష్టంమీద అణచుకుంటూ.

''దవడ మెంతికాయా? అదెలా వుంటుంది?'' అన్న ఆవిడకి కాస్త మెంతికాయ తీసి డిస్పోజబుల్ కప్పులో వేసిచ్చేసాను.

చెప్పొద్దూ... ఊరగాయలు పంచిపెట్టడానికి ప్రత్యేకంగా అవి కూడా కొన్నాల్లేండి. లేకపోతే పచ్చడి వేసిచ్చిన కప్పులు మీ ఇంట్లో వున్నాయి, మావి మాకివ్వండి అంటూ కొంపకొంపకీ తిరగాలి మళ్లీ.

మెంతికాయ తీసుకుని ఆవిడలా వెళ్లిందో లేదో పైవాటాలోంచి మా ఇంటావిడ దిగొచ్చేసింది.

''ఏంటి మాలతీ! ఆంధ్రా నుంచి మామిడికాయ పచ్చడి తెచ్చావా?'' అంటూ.




'వీళ్లకి ఆవకాయకీ, మామిడికాయ పచ్చడికీ తేడా తెలిసిచావదు' లోలోపల తిట్టుకుంటూనే ఆవిడకీ కాస్తంత దవడమెంతికాయ్ సమర్పించుకున్నాను.

ఇంటావిడని సాగనంపేసరికి దొడ్డి గుమ్మం గోడమీంచి వెనకింటావిడ పిలుపు. ఈసారి మా దవడ మెంతికాయ్ గోడమీంచి అవతలికి దూకింది. ఆ రోజు రాత్రి పదయ్యేలోపు మా చుట్టుప్రక్కలవాళ్లందరికీ దవడ మెంతికాయ్ అందిపోయింది. ఇలా అందరికీ వాళ్ళందరికీ ఇచ్చేయడంతో డబ్బా కూడా ఖాళీ అయిపోయింది. ఖాళీ డబ్బాని కడుగుతుంటే ఒక్కసారి అయినా వేసుకోకుండానే మెంతికాయంతా అయిపోయినందుకు నా మనసు తెగ బాధపడిపోయింది.

తెల్లారింది.

మెంతికాయ మీద పొగడ్తలూ, విమర్శలతో మళ్ళీ చుట్టుప్రక్కలవాళ్ళ దండయాత్ర మొదలవుతుంది అనుకుంటూనే మంచం దిగాన్నేను. మామూలుగా పని చేసుకుంటున్నానన్న మాటేగానీ నా దృష్టంతా చుట్టుప్రక్కల వాళ్ళమీదే ఉంది. తెల్లారి గంట గడిచింది. రెండో గంట కూడా అయిపోయింది.

పెట్టిందంతా పీకల్దాకా మేసేసి అది అరిగిపోయాక అప్పుడు ''మీ ఆంధ్రావాళ్ళకు అసలు ఊరగాయలు పెట్టడం రాదు. వంటలు చేయడమే సరిగా చేతకాదు మీకు'' అంటూ కువిమర్శలు గుప్పించే మా ఇంటావిడ రాలేదు.

''నిన్న మీరిచ్చిన పచ్చడి ఎంత బావుందో. అసలు మావాళ్ళంతా దాని కోసం కొట్టుకుచచ్చారనుకోండి నాకంటే నాకంటూ. మీరు జాడీ మొత్తం ఇచ్చేసినా మావాళ్ళు పెచ్చు మిగల్చకుండా తినేసేలా వున్నారు'' అంటూ పొగడ్తల్ని అడ్డు పెట్టుకుని మరికొంచెం పచ్చడి పింగించాలని చూసే పక్కింటి దుర్గమ్మగారు రాలేదు.

''నిన్న నేనిచ్చిన పచ్చడి బావుందా?'' అని పనిగట్టుకుని నేనే అడిగితే ''బాగేమిటి, ఓగేమిటి? తినడానికి ఏదోఒక పదార్థం. మీరిచ్చారు. మేం తినేసాం. ఇక ఇందులో ప్రత్యేకంగా చెప్పడానికేం వుంటుంది?'' అంటూ అమృతాన్నయినా గడ్డిపరకలా తీసిపారేసే వెనకింటావిడ కూడా కనిపించలేదు.

నాకు రాన్రానూ ఆత్రం పెరిగిపోసాగింది. 'ఏమయ్యారు వీళ్ళంతా?' నాలో నేనే చాలాసార్లు అనుకున్నాను. రెండుసార్లు పక్కింటి వైపూ మరో నాలుగుసార్లు వెనకింటివైపూ చూసాను. ఎవరూ కనపడలేదు. ఇంటావిడ సంగతేమైందో? అనుకుంటూ పైకి వెళ్లడం కోసం మెట్లవైపు నడవబోయాను.

ఇంతలో స్పృహలోలేని ఆవిడ్ని చేతులమీద వేసుకుని మోసుకుంటూ ఇంటావిడ కొడుకులిద్దరూ హడావుడిగా మెట్లు దిగుతున్నారు. వాళ్ళ చేతుల్లో మా ఓనర్ తోటకూరకాడలా వేలాడిపోతోంది.

''ఏమైందీ?'' కంగారుగా అడిగాను.

''అర్ధరాత్రి నుంచీ ఒకటే మోషన్స్. తగ్గుతాయిలే అనుకుంటే ఇదీ పరిస్థితి. హాస్పిటల్‌కు తీసుకువెళ్తున్నాం'' చెప్పేసి ఆవిడ్ని తీస్కెళ్లి ఆటోలో కూర్చోబెట్టారు వాళ్ళు. క్షణాల్లో ఆటో కనుమరుగైపోయింది.

'ఆవిడ ఆరోగ్యం ఎలా వుంటుందో ఏమిటో పాపం? అసలైనా హఠాత్తుగా విరోచనాలెందుకు పట్టుకున్నాయో?' అనుకుంటూ నిట్టూర్చాను. సరిగ్గా అప్పుడే దుర్గమ్మగారూ మా ఇంటి ఓనరూ ఫ్రెండ్స్ అన్న సంగతి గుర్తొచ్చింది. ఈ విషయం పక్కింటావిడకి చెబుదామని అటు నడిచాను. ఆవిడ్ని పిలిస్తే వాళ్ళబ్బాయి వచ్చాడు.

''మీ అమ్మగారేరి?'' ఆరా తీసాను.

''హాస్పిటల్కి వెళ్లారంటీ'' అన్నాడు.

ఖచ్చితంగా మా ఇంటావిడ కోసమే వెళ్లుంటుంది. ఆవిడకి ఈ విషయం నాకంటే ముందే తెలిసిపోయుంటుంది. అంచేత ఇక ఎందుకూ? ఏ హాస్పిటల్ అవడగడం అనవసరం అనిపించింది. గాఢంగా నిట్టూర్చి వెనక్కి తిరిగాను. మరోసారి వెనుకింటి వైపు చూసాను. యధాప్రకారం తలుపులు మూసి వున్నాయి. అక్కడే వున్న వాళ్ళ పనిమనిషిని అడిగాను.

''మా అమ్మగారికి వంట్లో బాగుండలేదు'' అని చెప్పింది.

'వేసవికాలం కదా. ఆరోగ్యం విషయంలో ఏదో ఒక లోపం తప్పదు' అనుకుంటూనే లోపలకు వచ్చేసాను.

ఒకటి కాదు, రెండుకాదు, వర్సగా మూడురోజులు గడిచిపోయాయి. మధ్యలో ఓసారి హాస్పిటల్కి వెళ్లి మా ఇంటి ఓనర్ని చూసి వచ్చాను. ఆవిడెందుకో చాలా ముభావంగా వుండిపోయింది. ఎంతో ఆప్యాయంగా పలకరించే ఆవిడ అలా ఎందుకలా ఉండిపోయిందో నాకర్థంకాలేదు. దాని గురించే ఆలోచిస్తూ తిరిగొచ్చేస్తుంటే దార్లో మెడికల్ షాపు దగ్గర పక్కింటి దుర్గమ్మగారు కనిపించారు. నన్ను చూసి కూడా చూడనట్టే మొహం తిప్పుకుని వెళ్లిపోయింది. ఇక వెనకింటావిడ కూడా డిటో డిటో. నేను ఎన్నిసార్లు కనిపించినా నన్ను పలుకరించే ప్రయత్నాలేవీ చేయలేదు. నేనే మాట్లాడబోతే నా ప్రయత్నాల్ని సాగనివ్వనూలేదు.

వాళ్ళేకాదు ఇంచుమించు చుట్టుప్రక్కల వాళ్ళందరూ అదే పద్ధతిలో ఉండేసరికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంత ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా నాకు అర్థం కాలేదు. నేనా ఆలోచనల్లో ఉండగానే కేశవపల్లి నుంచి ఫోన్. అమ్మ చేసింది. ఫోన్లో అమ్మ గొంతు వినేసరికి నాకు ప్రాణం లేచొచ్చింది.

''అమ్మా! ఏమిటీ సంగతి?'' ఆత్రంగా అడిగాను.

''మొన్న పట్టుకెళ్లిన దవడ మెంతికాయ్ తిన్నార్టే?'' మొట్టమొదట అమ్మ అడిగిన ప్రశ్న అది. అమ్మ గొంతులో ధ్వనించిన ఆందోళన నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

''లేదు. అంతా చుట్టుప్రక్కలవాళ్ళకి పంచి పెట్టడానికే సరిపోయింది'' నిట్టూరుస్తూ అన్నాను.

''వాళ్ళంతా బావున్నారా?'' అమ్మ నోట్లోంచి తూటాలా దూసుకొచ్చిందా మాట.

ఆశ్చర్యపోయాన్నేను.

''ఇదేం ప్రశ్న?'' అయోమయంగా అడిగాను.

''దవడ మెంతికాయ్లో కల్తీ నూనె కలిసింది. ఆ కొట్టువాడు చూసుకోకుండా ఇచ్చేశాట్ట. విషయం మొన్ననే బయటపడింది. వాడిచ్చిన నూనె వాడినవాళ్ళల్లో చాలామంది విరోచనాల్తో హాస్పిటల్లో చేరార్ట కూడా. ఊళ్ళో పెద్ద గొడవే అయింది'' అమ్మ చెప్పుకుపోతోంది.

నాకు మాత్రం అమ్మ మాటలేవీ బుర్రలోకి వెళ్లట్లేదు. నా ఆలోచనలన్నీ మా దవడ మెంతికాయ్ తిన్న ఇరుగుపొరుగుల చుట్టూనే తిరుగుతున్నాయి.

'అయితే ఇంటావిడ అపస్మారక స్థితికీ, పక్కింటావిడ మొహం తిప్పుకోవడానికీ, వెనకింటావిడ మాట్లాడకపోవడానికీ కారణం మా దవడ మెంతికాయేనన్నమాట' అనుకుంటుంటే నా గుండె గుభేలుమంది.

రాత్రి ఆయన ఆఫీసు నుంచి రాగానే ఆ విషయమే చెప్పాను.

''పాపం మన మెంతికాయ తిన్నవాళ్ళందరూ ఏమనుకుంటారో ఏమో? దీని మూలంగా అందరికీ మనం శత్రువులైపోయాం?'' నిట్టూరుస్తూ అన్నాన్నేను.

''అయితే అయ్యాంలే. అందువల్ల మనకంతా లాభమే'' తాపీగా అన్నారాయన.


తెల్లబోయాన్నేను ''అదేమిటి?'' అయోమయంగా అడిగాను.

''ఈ దెబ్బతో మన ఊరగాయంటే అందరికీ హడలు పట్టుకుంటుంది. అంచేత ఇక మళ్లీ సంవత్సరం మనం ఆవకాయ తెచ్చినా 'రుచి చూపించండి' అని ఎవ్వరూ మనని అడగరు సరికదా మనం తినమని బతిమిలాడినా కూడా తినరు. అంచేతా అంతా మన మంచికే'' వివరించారాయన.

అప్పుడనిపించింది... ఎదుటివాళ్ళు గౌరవంగా మనస్ఫూర్తిగా ఇచ్చింది పుచ్చుకుంటే మర్యాద. అంతేతప్ప పదిసార్లు పీడించి ఇచ్చేలా చేసుకోవడం మంచి పద్ధతికాదు. అలాంటి పద్ధతులున్న వాళ్ళకి ఇలాంటి దవడమెంతికాయలే మంచి గుణపాఠాలు నేర్పుతాయి' అని.

కాగల కార్యం 'దవడ మెంతి కాయ్' తీర్చింది అనుకుంటూ గాఢంగా నిట్టూర్చాను.

## డిస్కో శాంతి తమ్ముడు



హీరోయిన్ చెల్లెళ్ళు హీరోయిన్స్గా, హీరోల తమ్ముళ్ళు హీరోలుగా వస్తున్న ఈరోజుల్లో డాన్సర్ డిస్కో శాంతి తమ్ముడు హీరోగా వస్తున్నాడండోయ్! 'నాగ' అనే తమిళ్ చిత్రంలో జయానంద్ నటిస్తుండగా, ప్రేమ హీరోయిన్గా నటిస్తోంది. అన్నట్టు 'సాంబయ్య' చిత్రంలో బావగారు శ్రీహరి పక్కన ప్రధానపాత్రగా నటించాడండోయ్! తెలుగులో కూడా హీరోగా చెయ్యాలని వుందట ఈయనగార్కి! వింటున్నావా శాంతీ! తమరే తమ్ముణ్ణిపెట్టి ఓ సినిమా తీస్తే పోలా!

## కన్నడ తమ్ముడి సినిమా విశేషాలు..

'తమ్ముడు' సినిమా తెలుగులో ఎంత హిట్ అయిందో మనందరికీ తెలిసిందే. మరి అంత హిట్టయిన సినిమాని మరో భాషవాళ్ళకి తియ్యాలని అనిపించడం సహజమే కదా! సో, ప్రముఖ మోడల్ లీసారే హీరోయిన్గా, కన్నడ హీరో శివరాజ్కుమార్ హీరోగా కన్నడంలో వస్తున్న ఈ పిక్చర్పై చాలామందికి ఎక్స్పెక్టేషన్స్ వున్నాయి. కన్నడ సినిమాలు ఇంతవరకూ విదేశాల్లో ఎవరూ షూట్ చెయ్యలేదు. మొదటిసారి 'తమ్ముడు' కన్నడ సినిమా పాటలకోసం విదేశాలకి వెళ్తున్నారు. ఇన్ని స్పెషల్స్ వున్న ఈ సినిమా కన్నడంలో కూడా హిట్టే అవుతుంది కదా!

